ఎన్నాళ్లీ వాగు కష్టాలు

- నత్తనడకన వంతెన నిర్మాణ పనులు
- గుబిడి, టెక్డిరాంపూర్ ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు



వాగు దాటుతున్న ప్రజలు (ఫైల్)

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) నుంచి గుబిడి గ్రామానికి వెళ్లాలంటే వాగును దాటాలి. గత కొన్నేళ్లుగా గుబిడితో పాటు టెక్డిరాంపూర్, కొజ్జన్‌గూడ గ్రామాల ప్రజలు వాగుదాటి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో వరదనీటి ఉధృతిలో వాగు దాటలేని పరిస్థితి నెలకొంటుంది. అత్యవసర సమయాల్లో సరైన వైద్యం అందక పలువురు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి. వంతెన నిర్మాణం కోసం ప్రజలు ఆశతో ఎదురుచూశారు. వాగుపై వంతెన నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించడంతో గత రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గతేడాది నుంచి పనులు ప్రారంభించినా.. పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈఏడాది వరద ఉధృతి పెరిగితే ప్రజలకు రవాణా కష్టాలు తప్పేలా లేదు.

రాకపోకలు బంద్..

కరంజి(టి) వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. భారీ వర్షాలు కురిస్తే కరంజి(టి) వాగు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు వరదనీటితో ప్రవహిస్తే మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సి పరిస్థితి. అత్యవసర సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సి ఉంటుంది. వరద ప్రవాహం ఉన్నప్పుడు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిదేనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లు..

ప్రభుత్వం వంతెన నిర్మాణం కోసం రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసింది. గతేడాది జనవరిలో పనులు ప్రారంభించినా.. నేటికి కొనసాగుతునే ఉన్నాయి. వర్షాకాలం కంటే ముందే పూర్తికావాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికీ యాభై శాతం పనులు మాత్రమే పూర్తయింది. వరద ఉధృతి పెరిగితే పనులు నిలిచిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన పనులను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



కరజి(టి) వాగుపై నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులు వేగవంతం చేయాలి. గతంలోనే అధికారులకు విన్నవించాం. వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేస్తే రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. వరదనీరు ఉప్పొంగి ప్రవహిస్తే గ్రామం నుంచి బయటకు వెళ్లడం కష్టమవుతుంది.

– ఎల్ములె ప్రతాప్ యాదవ్, సర్పంచ్, గుబిడి

ఇబ్బంది పడుతున్నాం



ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే వాగులో నుంచి రాకపోకలకు పెద్ద సాహసం చేయాల్సి వచ్చేది. గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు దూరం అవుతాయని భావించాం. కానీ వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో వాగులో నుంచి వెళ్లేందుకు కష్టాలు తప్పేలా లేదు.

– పుర్క శ్రీకాంత్, కొజ్జన్‌గూడ

సిడాం శంభు వర్ధంతి విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పెందూర్ దాదిరావు

నార్నూర్: తుడందెబ్బ వ్యవస్థాపకులు సిడాం శంభు వర్ధంతిని విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు కోరారు. సోమవారం గాదిగూడ మండలంలోని లోకారి(కె)లో మాట్లాడారు. ఈనెల 20న ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడలో సంస్మరణ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. తుడందెబ్బ మండల గౌరవ అధ్యక్షుడు పూసం బాదిరావు, మండలాధ్యక్షుడు మాడవి చంద్రహరి, దేవురావు, పెందూర్ మధు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: సిడాం శంభు వర్ధంతిని విజయవంతం చేయాలని సిడాం శంభు తనయుడు సిడాం సోనేరావు, ఆదివాసీల సంఘాల నాయకులు పెందూర్ పుష్పరాణి, పుర్కబాపురావు పిలుపునిచ్చారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కుమురం భీం ఉద్యమ స్ఫూర్తితో అనేక పోరాటలు చేశారని గుర్తుచేశారు. ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆర్థిక సాయం

నేరడిగొండ: మండలంలోని రాథోడ్ యోగేశ్వర్ వైద్య చికిత్స కోసం నేరడిగొండ క్రికెట్ క్లబ్ సభ్యులు రూ.60 వేల ఆర్థిక సాయం అందజేశారు. నేరడిగొండ యూత్ ప్రెసిడెంట్, ఉప సర్పంచ్ ఏలేటి దేవేందర్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు వినోద్, సురేందర్, పవన్, నరేశ్, లఖన్, దినేశ్, హరీశ్, పాండు, రాజశేఖర్, ధనుంజయ్, జైవంత్ మురళీ పాల్గొన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు విన్నవిస్తున్న ఉద్యోగులు

ఇచ్చోడ: సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సోమవారం సమగ్ర శిక్ష ఉద్యోగం సంఘం నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సమగ్ర శిక్షణలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించకుండా జాప్యం చేస్తుందని ఆరోపించారు. ఉద్యోగులకు బీఎస్పీ అండగా ఉంటుందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చారు. నాయకులు పడాల రవీందర్, శ్యాం, మల్లిక, రవికాంత్‌రెడ్డి, గంగాకిషన్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందేలా చూస్తాం

- నానుబాయి వివరాలు సేకరించిన ఆరోగ్యశ్రీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..



ఆర్థికసాయం అందజేస్తున్న ఇర్షాద్ అలీ

బోథ్: నానుబాయికి మెరుగైన వైద్యం అందేలా చూస్తామని ఆరోగ్యశ్రీ సిబ్బంది అన్నారు. ఈనెల 17న 'దుర్భర జీవితంలో కుటుంబం' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించారు. సోమవారం నానుబాయి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉచిత బస్‌పాస్ అందిస్తామని, ఆదిలాబాద్‌లోగానీ, నిర్మల్‌లోగాని డయాలసిస్ చేయిస్తామన్నారు. అలాగే బోథ్ గ్రామానికి చెందిన మీర్ ఇర్షాద్ అలీ రూ. 3 వేలను నానుబాయికి అందజేశారు. ఆరోగ్యమిత్ర రజనీష్, ఆరోగ్యశ్రీ టీం లీడర్ వ్యాస్, సోలంకి సత్యనారాయణ, తుకా రాం, ప్రకాశ్, సాయి, మహేందర్, సుధాకర్, గులా బ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన



బోథ్: రాస్తారోకో చేస్తున్న కార్మికులు



ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో..



నేరడిగొండ: భిక్షాటన చేస్తున్న కార్మికులు



ఇచ్చోడ: రాస్తారోకో చేస్తున్న జీపీ కార్మికులు



బజార్‌హత్నూర్‌లో..

నేరడిగొండ: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరుకుంది. సోమవారం మండల కేంద్రంలోని దుకాణాల వద్ద భిక్షాటన చేస్తూ కార్మికులు నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షుడు రాచకొండ పోశెట్టి మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు గజ్జల అశోక్, నందేడపు రాజు, హరిప్రసాద్, రాజేశ్వర్, మెర్సాన్, జాదవ్ బలరాం, ఉత్తమ్, విఠల్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐటీయూసీ మండల అధ్యక్షుడు దేవేందర్‌గౌడ్ తెలిపారు. సోమవారం పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. కనీస వేతనం, పీఎఫ్‌ఈఎస్ఐ అమలు, ప్రమాదబీమా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్వర్, నరేశ్, నర్సమ్మ, కిష్టయ్య, గంగాధర్, లలిత, లక్ష్మీ, అడెల్లు, జనార్దన్, అనిల్, అర్జున్, రవీందర్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బంజారా యువసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కపిల్‌కుమార్ జాదవ్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మికులు ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. శ్రీను, వెంకటేశ్, సుందర్, సల్మాన్, రాధ, గంగమ్మ, సోనేరావు, గోవింద్, కరుణ పాల్గొన్నారు.

ఇచ్చోడ: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బోడ్డు ఆశన్న ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతుగా రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని సుంకిడి గ్రామంలోని రాష్ట్ర రహదారిపై పారిశుద్ధ్య కార్మికులు రాస్తారోకో నిర్వహించారు.

బోథ్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులు ర్యాలీ నిర్వహించారు. వారికి అంబేద్కర్ సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కంది ప్రవీణ్, బత్తుల రమేశ్, సలహాదారులు సాగర్, పసుల చంటి, సంతోశ్, భూమన్న, ప్రభాకర్, పింటు, సన్నీ పాల్గొన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ జిల్లెపల్లి నవీన్ మాదిగ మద్దతు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, దేవిదాస్, జిల్లెపల్లి బాపురావు, బోమ్మెన బక్కయ్య, చాకటి కొద్దు, సంతోశ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న మెస్రం భాస్కర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం బలోపేతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. నేటికి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించలేదన్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మరుగుదొడ్లు, గ్రంథాలయం, ఆటస్థలం, క్రీడ సామగ్రి వసతులు కల్పించలేదన్నారు. సమావేశంలో కోవ వేణుగోపాల్, కోటనక్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

27న సంస్మరణ సభ

ఉట్నూర్‌రూరల్: భారత విప్లవోద్యమ నిర్మాతలు క్రామేడ్స్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డిల సంస్మరణ సభ ఈనెల 27న ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల మార్కెట్ కమిటీ యార్డులో మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించడం జరుగుతుందని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విప్లవకారులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర ఇన్‌చార్జి సెక్రెటరీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఏఐసీసీ సెక్రెటరీగా నియామకమైన తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సెక్రెటరీ విశ్వనాథ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకులు కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, నరేశ్‌జాదవ్, గజేందర్, అశోక్, చారులత, భరత్ చౌహాన్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఇచ్చోడ: రెండు సంవత్సరాలకు ఒక్కసారి నిర్వహించే అంబేద్కర్ అసోసియేషన్ ఎన్నికలు విజయవంతం చేయాలని జిల్లా హడక్ కమిటీ అధ్యక్షుడు ఫవర్ రఘునాథ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించి ఎన్నికల నియమావళి పత్రాలు అందచేశారు. కమిటీ సభ్యులు గ్రామాల్లో పర్యటించి ఎన్నికలను విజయవంతం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శైలేందర్ వాగ్మరే, దుర్గం శేఖర్, దయనంద్ కాంబ్లే, గంగారం బోర్‌కార్, నర్వేడే రమేశ్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

బోథ్ డివిజన్ కోసం దీక్షలు



దీక్షలో పాల్గొన్న సభ్యులు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్ష ప్రారంభించారు. తెలంగాణ ఏర్పాటు అయినప్పటి నుంచి బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరినా ప్రజాప్రతినిధులు పట్టించుకోదని మండిపడ్డారు. తెలంగాణ కోసం ఉద్యమం చేశామని, అదే స్ఫూర్తితో డివిజన్ కోసం దీక్షలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, గ్రామస్తులు దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం ప్రకటించారు.

సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న రూపేష్‌రెడ్డి

బేల: మండలంలోని భవానీగూడ(సి) గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు టేకం అయ్యూ ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సోమవారం బాధిత కుటుంబానికి యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, గావుండే ఘణేశ్యాం, గోడే అవినాష్, మడావి చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. బీటీరోడ్డు వేయండి సారూ..



బజార్‌హత్నూర్: మండలంలోని దేద్ర, మాన్కపూర్, ఉమార్ద, గిరిజాయి గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే సైకిల్ కూడా వెళ్లలేని దుస్థితి. ఏడు నెలల క్రితమే బీటీరోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా రూ.1.75 కోట్లు మంజూరైనా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: శంకర్‌రావ్, ఏఈ ఐటీడీఏ, ఉట్నూర్, ఫోన్: 94926 81897

'ప్రజాసమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే'



వంతెనను పరిశీలిస్తున్న పాయల్ శంకర్

జైనథ్: ఎమ్మెల్యే జోగు రామన్నకు ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. సోమవారం ఆయన మండలంలోని తరోడ సమీపంలోని సాత్నాల వాగుపై తెగిపోయిన తాత్కాలిక వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 2018లో తరోడ వంతెన కుంగిపోయిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్త వంతెన ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఏడాది క్రితమే వంతెన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టకపోవడంతోనే వంతెన పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. ప్రస్తుతం అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకులు రమేశ్, గజానన్, రత్నాకర్‌రెడ్డి, వెంకన్న, ముకుంద్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: కుమురంభీం కాలనీవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, కనీస మౌలిక వసతులు కల్పించాలని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కుమురం భీం కాలనీలో పర్యటించారు. కేవీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే జోగు రామన్నను ఇళ్ల పట్టాల కోసం నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో గీమ్మ సంతోశ్, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండూరి రవి, రాజ్ మొహమ్మద్, ఆత్రం గణపతి, మనోజ్, గోడం రేణుక, ఉయిక ఇంద్రబాయి, ఆత్రం బుజంగ్ రావు, దుర్వ రాజారామ్, తొడసం ప్రకాశ్, మాడవి గంభీర్, మార్సుకోల మాధరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్, తాటిగూడ కాలనీలకు చెందిన వందలాది మంది యువకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కంది శ్రీనివాస్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాలనీవాసుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలు



గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలోని కుమారి, వడూర్ గ్రామాల్లో సోమవారం ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో చేపట్టిన 2021– 23 సంవత్సరం వరకు చేపట్టిన ఉపాధిహామీ పనులను గ్రామసభలో చదివి వినిపించారు. ఏమైనా అవకతవకలు జరిగాయా? లేదా. అనే విషయాలపై ఆడిట్ బృందం పరిశీలించి గ్రామస్తులకు వివరించారు. ఉప సర్పంచ్ గడ్డం నరేశ్‌రెడ్డి, వడూర్ సర్పంచ్ గాదె సమత, పంచాయతీ కార్యదర్శులు అరుణ్ రెడ్డి, నర్సారెడ్డి, టీఏలు మధుకర్, వినోద్, ఎఫ్ఏలు రాజేశ్వర్, నర్సయ్య, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

20న సామాజిక తనిఖీ ప్రజావేదిక

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను ఈనెల 20న నేరడిగొండలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సమద్ ఒక ప్రకటనలో తెలిపారు. చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు నివేదిక చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ కూలీలు హాజరై అభ్యంతరాలు ఉంటే తెలుపవచ్చన్నారు.

రేపు ఉపాధిహామీ గ్రామసభలు

మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వాంకిడి, దర్బతండా, రాజూర, వెంకటాపూర్, తేజాపూర్, బోరిగాం, నాగమల్యాల్, చిన్నబుగ్గారం, కొర్టికల్(కె), కుంటాల(బి), నేరడిగొండ, సవర్గాం, యాపల్‌గూడ, పీచర, ఇస్పూర్, గుత్పాల గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



ఎంపీ సోయం బాపురావ్‌తో గ్రామస్తులు

ఇంద్రవెల్లి: దుబ్బగూడ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శంకర్‌గూడ గ్రామస్తులు జిల్లా ఎంపీ సోయం బాపురావ్‌కు విన్నవించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంపీ సోయం బాపురావ్ నివాసానికి వెళ్లి గ్రామ సమస్యలను వివరించారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నామని, గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని శంకర్‌గూడ గ్రామస్తులు విన్నవించగా.. మట్టి రోడ్, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 8 లక్షల నిధులు మంజూరు చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ తుంరం లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనే రైతురాజ్యం

ఖానాపూర్: సీఎం కేసీఆర్ పాలనలోనే రైతురాజ్యం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని దిలావర్‌పూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో క్లస్టర్ పరిధిలోని రైతులతో మాట్లాడారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిత, మోహిద్, పుప్పాల శంకర్, వాల్‌సింగ్, గంగాధర్, రాజగంగన్న పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

బేల: బేల ఎస్సై కృష్ణకుమార్ నిజామాబాద్ 5వ టౌన్‌కు బదిలీ అయిన సందర్భంగా సోమవారం ఏబీవీపీ, బీజేవైఎం నాయకులు ఎస్సైని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్‌రెడ్డి, పోత్రాజ్ నవీన్, మనోజ్‌రెడ్డి, అజయ్ పాల్గొన్నారు.